
సాక్షి ప్రకాశం

శనివారం। 1। మార్చి। 2025

హరోం హర
కొత్తపట్నం మండలం మడనూరు రామలింగేశ్వరుని రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం 33/24

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగ మంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఇంటర్మీడియెట్ పరీక్షలకు మొత్తం 42,439 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో మొదటి సంవత్సరం పరీక్షలు 21,624 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 20,815 మంది విద్యార్థులు రాయనున్నారు. వీరి కోసం 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 67 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67 మంది డిపార్టుమెంటల్ అధికారులను, 1089 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. వీరికి ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. 8.30 గంటలకే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు.

బాలికను గర్భవతిని చేసి పరారైన యువకుడు

ఒంగోలు టౌన్: నగరానికి చెందిన ఒక యువకుడు మాయమాటలతో బాలికను లొంగదీసుకుని గర్భవతిని చేసి పరారయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం ... ఒంగోలు నగరానికి చెందిన షేక్ ఆరీఫ్ అనే 25 ఏళ్ల యువకుడు స్థానిక మంగళపాలెంలోని స్నేహితుడి ఇంటికి తరచూ వస్తూపోతూ ఉండేవాడు. ఈ క్రమంలో స్నేహితుడి మేనత్త కూతురైన 18 ఏళ్ల బాలికతో అతనికి పరిచయమైంది. తరచూ ఆమెతో ఇన్‌స్ట్రాగామ్ చాటింగ్ చేయడం మొదలుపెట్టాడు. తన పిన్ని కూతురు పుట్టిన రోజని, కేక్ కటింగ్ జరుగుతుందని మాయమాటలు చెప్పి పేర్నమిట్టలోని గదికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక నెలతప్పడంతో సమాచారం తెలుసుకున్న ఆరీఫ్ ఊరి నుంచి పరారయ్యాడు. వాకబు చేయగా ఆరిఫ్‌కు అప్పటికే పెళ్లయిందని తెలిసింది. దాంతో మోసపోయానని గ్రహించిన బాధిత బాలిక జరిగిన విషయాన్ని తలిదండ్రులకు తెలియజేసింది. వారు ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ అజయ్‌కుమార్ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తండ్రి హత్య కేసులో కొడుక్కి జైలు

చీమకుర్తి: బండ్లమూడి గ్రామంలో తండ్రిని హత్య చేసిన సంఘటనలో కొడుకుకి జిల్లా కోర్టు జైలు శిక్ష విధించినట్లు సీఐ ఎం.సుబ్బారావు శుక్రవారం తెలిపారు. వనిపెంట లక్ష్మారెడ్డిని ఆయన కుమారుడు చంద్రశేఖరరెడ్డి 15 రోజుల క్రితం మెడపై గొడ్డలితో వేటు వేయగా తీవ్ర గాయాలైన లక్ష్మారెడ్డి ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఫిబ్రవరి 18న మృతి చెందాడు. తండ్రి కొడుకుల మధ్య ఆస్తి వివాదం కారణంగా ఈ సంఘటన జరిగింది. తండ్రిపై హత్యకు పాల్పడిన కొడుకు చంద్రశేఖరరెడ్డిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.

పోలీసుల అదుపులో జంట హత్యల కేసు నిందితుడు

మార్కాపురం: మండలంలోని వేములకోటలో గతేడాది జూలై 1వ తేదీన సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వేములకోటలో భార్య రేళ్ల సునీత, అత్త కన్నెసాని నారాయణమ్మను నిందితుడైన రేళ్ల శ్రీను కత్తితో పొడిచి హత్య చేశాడు. అప్పటి నుంచి శ్రీను సెల్‌ఫోన్ వాడకుండా తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ తప్పించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు నిందితుడి కదలికలు, బంధువులపై నిఘా పెట్టడంతో రైల్వేస్టేషన్ సమీపంలో సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

- వెలుగొండకు కావాల్సింది కొండంత.. విదిల్చింది గోరంత
- రూ.359 కోట్లతో సరిపెట్టిన బాబు సర్కార్
- ఆర్‌ఆర్ ప్యాకేజీకి రూ.1000 కోట్లు అవసరమైతే ఇచ్చింది రూ.116 కోట్లే
- తెలుగు తమ్ముళ్లకు ఏటీఎంగా గుండ్లకమ్మ నిధులు
- తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు కేటాయింపులపై పెదవి విరుపు
- ఉచిత బస్సు ఊసు లేదు
- బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాకు అత్తెసర నిధులు



కూటమి సర్కార్ బడ్జెట్‌లో జిల్లాకు అత్తెసరు నిధులు విదిల్చింది. వెలుగొండ ప్రాజెక్టుపై ఎప్పటిలాగే చంద్రబాబు ప్రభుత్వం తొండిచేయి చూపించింది. ఎన్నికల ముందు చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తర్వాత ముగ్గురు కేబినేట్ మంత్రులు చేసిన ప్రకటనలకు భిన్నంగా కేటాయింపులు జరిగాయి. మరో కీలక ప్రాజెక్టు గుండ్లకమ్మకు సైతం మొక్కుబడిగా నిధులు విదిల్చింది. కనీస మద్దతు ధర లేక అవస్థలు పడుతున్న మిర్చి రైతులను ఆదుకునేందుకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చేసిన విజ్ఞప్తులను గాలికొదిలేసిన ప్రభుత్వం జిల్లాను మిర్చి క్లస్టర్‌గా చేర్చుతూ కంటితుడుపు ప్రకటన చేసింది. దీనిపై రైతులు, రైతు సంఘాల నేతలు మండిపడుతున్నారు. సూపర్ సిక్స్‌లో ఉచిత బస్సు ఊసే లేకుండా పోయింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు కేటాయించిన నిధులు పరిశీలిస్తే జిల్లాలో చాలా మందికి కోతపడే అవకాశం ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




మాయ మాటలు.. హామీలకు నీళ్లు..

వెలుగొండను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు



పశ్చిమ ప్రాంతాలకు సంజీవిని లాంటి వెలుగొండ ప్రాజెక్టుకు అరకొర నిధులను కేటాయించడం కూటమి ప్రభుత్వ వక్రబుద్ధికి నిదర్శనం. బడ్జెట్లో కేవలం రూ.359 కోట్లు మాత్రమే కేటాయించడం, ఆర్‌ఆర్ ప్యాకేజీకి రూ.116 కోట్లు మాత్రమే కేటాయించడం పశ్చిమ ప్రకాశం ప్రజలను దగా చేయడమే. మార్కాపురంను జిల్లా చేస్తామని చెప్పి ఇప్పుడు మాట దాటవేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలంటే చంద్రబాబు ఎందుకు చిన్నచూపు చూస్తున్నారో చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వ మోసపూరిత విధానాలను ప్రజల తెలియజేస్తూ యర్రగొండపాలెం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేస్తాం.

– **తాటిపర్తి చంద్రశేఖర్,** యర్రగొండపాలెం ఎమ్మెల్యే

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలకు సాగునీరు, తాగునీరందించే వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే కరువు నేల సస్యశ్యామలమవుతుందని ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత ఎన్నికల సమయంలో మార్కాపురం వచ్చిన చంద్రబాబు నేనైతే వెలుగొండ ప్రాజక్టును చిటికెలో పూర్తి చేసి చూపిస్తానంటూ గొప్పలు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో వెలుగొండను పూర్తి చేసి నీరందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామిలతో కలిసి ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు వెలుగొండ ప్రాజెక్టును సందర్శించి ఆర్భాటంగా ప్రకటనలు చేశారు. అయితే అందుకు భిన్నంగా కేటాయింపులు జరిగాయి. ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.359 కోట్లు కేటాయింపులు ఏమూలకు సరిపోవని నీటిపారుదల నిపుణులు అంటున్నారు. నిజానికి ఈ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు కేటాయిస్తేనే కానీ అనుకున్నట్లు పనులు జరగవు. కనీసం ఈ ఏడాది బడ్జెట్లో రూ.2 వేల కోట్లు కేటాయిస్తే అందులోంచి రూ.1000 కోట్లు నిర్వాసితులకు, మరో రూ.1000 కోట్లు ప్రాజెక్టు పనుల కోసం వెచ్చించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రస్తుత బడ్జెట్లో కేటాయించిన నిధులతో ఏమి చేయాలో పాలుపోవడం లేదని అధికారులు వాపోతున్నారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.359 కోట్లలో నిర్వాసితులకు రూ. 116 కోట్లుగా చెబుతున్నారు. మిగిలిన రూ.243 కోట్లు దేనికి సరిపోతాయని ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. కూటమి ప్రభుత్వంపై పశ్చిమ ప్రకాశం జిల్లా రైతులు పెట్టుకున్న ఆశలపై నీరు చల్లినట్టయిందని, మాయమాటలు చెప్పిన చంద్రబాబు మరోసారి నిట్టనిలువునా మోసం చేశారని రైతు సంఘాలు ధ్వజమెత్తుతున్నాయి.

తల్లికి వందనంలో కోతలు తప్పవా...

అమ్మ ఒడి పథకాన్ని పేరుమార్చిన ప్రభుత్వం విద్యార్థుల తలిదండ్రులను ఏమార్చేందుకు సిద్ధమైంది. ఎన్నికలకు ముందు ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మ ఒడి పథకం ద్వారా ఒక్కొక్కరికి .. నీకు రూ.15 వేలు...నీకు రూ.15 వేలు అంటూ ఊదరగొట్టింది. అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది పాటు కాలయాపన చేసింది. ఇప్పుడు 2025-26 బడ్జెట్లో నామమాత్రపు నిధులను కేటాయించింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. 2019 నుంచి క్రమం తప్పకుండా నాలుగు విడతలుగా సుమారు రూ.1358 కోట్లు తల్లుల ఖాతాలో జమచేసింది. కరోనా సమయంలో కూడా విద్యార్థులకు అమ్మఒడి ఇచ్చి తన మాట నిలుపుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మాత్రం మీనమేషాలు లెక్కిస్తూ 9 నెలలు గడిపింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేదని కుంటి సాకులు చెబుతూ ఒక ఏడాది తల్లికి వందనం ఇవ్వకుండా మోసం చేసింది. ప్రస్తుతం తల్లికి వందనం పథకానికి కేటాయించిన నిధులను గమనిస్తే పెద్ద సంఖ్యలో విద్యార్థులకు కోత పెట్టేందుకు తెరవెనుక కుట్రలు చేస్తున్నట్లు అర్థమవుతోంది.

జిల్లా అభివృద్ధి పట్టని టీడీపీ ఎమ్మెల్యేలు...

రాష్ట్రంలో ప్రకాశం జిల్లా వెనకబడిన ప్రాంతంగా పేరొందింది. జిల్లా అభివృద్ధి కోసం కనీసం రూ.10 కోట్లు కేటాయించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఈ విషయంలో టీడీపీ ఎమ్మెల్యేలకు చీమకుట్టినట్టు కూడా లేదు. రాష్ట్ర బడ్జెట్లో జిల్లాకు నిధులు కేటాయించకపోవడంలో ఎమ్మెల్యేలు పూర్తిగా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని జిల్లా ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రంలో 4 పారిశ్రామిక కారిడార్‌లను అభివృద్ధి చేస్తామని చెప్పిన సీఎం దొనకొండ గురించి ప్రస్తావించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఇది ఎంత వరకూ కార్యరూపం దాల్చుతుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక సూపర్ సిక్స్‌లోని మహిళలకు ఉచితబస్సు అటకెక్కింది. దీంతో జిల్లాలోని సుమారు 12 లక్షల మంది మహిళలను ప్రభుత్వం మరోసారి మోసం చేసిందనే చెప్పాలి. అన్నదాత సుఖీభవకు కేటాయింపులు పరిశీలిస్తే గత ప్రభుత్వం కంటే లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గే అవకాశం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో 2.96 లక్షల మంది రైతులకు రైతుభరోసా ఇవ్వగా రానున్న రోజుల్లో ఈ సంఖ్యలో భారీగా కోతపడుతుందన్న అనుమానాన్ని రైతు సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి.

మిర్చి క్లస్టర్ ఎవరి కోసం..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో లాభాలు చవిచూసిన మిర్చి రైతులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధరల్లేక, ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో భారీగా నష్టపోయారు. గుంటూరు మార్కెట్లో ధరలు పతనమవుతున్న సమయంలో ఇక్కడ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న రైతులకు వినతులను ప్రభుత్వ పెద్దలుగాని, జిల్లా ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో మిర్చిరైతుల పరిస్థితి దయనీయంగా మారింది. తాజా బడ్జెట్‌లో జిల్లాను మిర్చిక్లస్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి చేతులు దులుపుకుంది. అసలు ఇది ఎవరికోసమని రైతులు ప్రశ్నిస్తున్నారు.

నిధులు కేటాయింపులో తీవ్ర అన్యాయం



వెలుగొండ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగింది. గత బడ్జెట్‌లో రూ.399 కోట్లు కేటాయిస్తే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రూ.359 కోట్లు కేటాయించింది. కేవలం నిర్వాసితులను తరలించడానికే రూ.800 కోట్ల ఖర్చవుతుంది. ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.2 వేల కోట్లు అవసరం. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మంత్రులు ప్రాజెక్టును సందర్శించి సమీక్షలు జరిపి వచ్చే జూన్, జూలై నెలల్లో నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు బడ్జెట్ లో నిధులు కేటాయించకుండా ప్రాజెక్టు పనులు ఏ విధంగా పూర్తవుతాయి?. సూపర్ సిక్స్ పథకాలు కేటాయింపులు లేవు. తల్లికి వందనంకి రూ.12 వేల కోట్లు అవసరమైతే రూ.9400 కోట్లు మాత్రమే కేటాయించారు.

– **బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి,** వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే

తాగు, సాగునీటి ప్రాజెక్టులకు తీరని నష్టం



జిల్లాకు ప్రధాన సాగునీటి వనరైన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో కేవలం రూ.359 కోట్లు కేటాయించడం దారుణం. మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టు పరిశీలనకు వచ్చినప్పుడు రూ.4 వేల కోట్లు అవసరమని చెప్పి బడ్జెట్‌లో 10 శాతం కూడా కేటాయించలేదు. ఈ లెక్కన ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తారో అర్థం కావటం లేదు. జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అందించకుండా నాలుగు సంవత్సరాల పాటు ప్రాజెక్టును సాగదీయటమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశంగా ఉంది. రాష్ట్ర మంత్రి స్వామి మాత్రం బడ్జెట్ సూపర్‌గా ఉందని ప్రకటించడాన్ని బట్టి ఆయన బడ్జెట్ కేటాయింపులు తెలిసి మాట్లాడుతున్నాడా లేక తెలియక మాట్లాడుతున్నాడా అర్థం కావటం లేదు. మంత్రి స్వామి ఇవే మాటలు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి చెబితే ప్రజలే ఆయనకు బుద్ధి చెబుతారు.

–**డాక్టర్ ఆదిమూలపు సురేష్,** వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి

పచ్చ తమ్ముళ్లకు పాకెట్ మనీగా గుండ్లకమ్మ నిధులు...

రాష్ట్ర బడ్జెట్లో గుండ్లకమ్మ ప్రాజెక్టుకు రూ.15.50 కోట్లు కేటాయించడంపై విమర్శలు వెల్లువెతుతున్నాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్వహణ కోసమంటూ రూ.6.50 కోట్లు బినామీ కంట్రాక్టర్ల పేరుతో టీడీపీ నాయకులు దోచుకున్నారని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. అప్పుడు కేటాయించిన నిధులను ప్రాజెక్టు కోసం నయా పైసా కూడా ఖర్చు చేయకుండా సుందరీకరణ పేరుతో కోట్ల రూపాయలు దిగమింగారన్న ఆరోపణలు ఉన్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం గుండ్లకమ్మకు రూ.9 కోట్లు కేటాయించి ప్రాజక్టు గేట్లన్నిటినీ మరమ్మతులు చేయించింది. అలాగే ఒంగోలుకు మంచినీరు అందించేందుకుగాను అన్నంగి కొండపై లిఫ్టను కూడా ఏర్పాటు చేసింది. ఇప్పుడు తాజాగా కూటమి ప్రభుత్వం కేటాయించిన నిధులతో కుడి కాలు, ఎడమ కాలువ పూడిక పనులు చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ పనులను ఇప్పటికే తెలుగు తమ్ముళ్లకు అప్పగించినట్లు తెలుస్తుంది. అంటే కాలువ పూడిక పనులు, ప్రాజెక్టు నిర్వహణ పేరుతో పచ్చ తమ్ముళ్లకు పాకెట్ మనీ ఇవ్వడమేనని రైతులు ఆరోపిస్తున్నారు.

మిగిలిన ప్రాజెక్టుల సంగతేంటి



వెలుగొండ ప్రాజెక్టుకు నామమాత్రంగా నిధులను కేటాయిండం దారుణం. ఎంతో ప్రతిష్టాత్మమైన వెలుగొండ ప్రాజెక్టునే పట్టించుకోని ప్రభుత్వం ఇక జిల్లాలోని సంగమేశ్వరం, పాలేటిపల్లి ప్రాజెక్టులను పట్టించుకుంటుందనుకోవడం అత్యాశే. జిల్లా అభివృద్ధికి నిధులు తీసుకొని రావడంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారు.

– **ఎస్‌కె మాబు,** సీపీఎం జిల్లా కార్యదర్శి

దగా చేసిన కూటమి ప్రభుత్వం



రాష్ట్ర బడ్జెట్లో వెలుగొండ ప్రాజెక్టుకు కేవలం రూ.359 కోట్లు కేటాయించడం జిల్లా ప్రజలను మోసగించడమే. దీనిని బట్టి చూస్తే వెలుగొండ పూర్తి చేసే విషయంలో సర్కారుకు చిత్తశుద్ధిలేదని తెలిసిపోతుంది. దొనకొండ పారిశ్రామికవాడ గురించి ఆశలు కల్పించడం మినహా మరేమీ కాదు. అంకెల గారడీతో మోసం చేయాలని చేస్తే ప్రజలేమీ పిచ్చివాళ్లు కాదు. తగిన గుణపాఠం చెబుతారు.

– **ఎంఎల్ నారాయణ,** సీపీఐ జిల్లా కార్యదర్శి

అరకొర కేటాయింపులు అన్యాయం



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర కేటాయింపులు చేయడం అన్యాయం. కేవలం 10.8 శాతం కేటాయింపులతో ఏమాత్రం విద్యారంగ అభివృద్ధి సాధ్యం కాదు. 13 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి అన్ని రకాల పెండింగ్‌లో ఉన్న వేల కోట్ల బకాయిల చెల్లింపులపై 12వ పీఆర్సీ మధ్యంతర భృతి, సీపీఎస్ ఉద్యోగులకు డీఏల 90 శాతం చెల్లింపులు, మ్యాచింగ్ గ్రాంట్‌జమ, పీఎఫ్, ఏపీ జీఎల్ఐ పార్ట్ ఫైనల్స్, ఎన్‌కాష్మెంట్ ఆఫ్ ఎర్న్‌లీవ్స్ మంజూరులను బడ్జెట్‌లో ఏ మాత్రం ప్రస్తావించలేదు. దీంతో ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లకు నిరాశ ఎదురైంది.

– **బి.అశోక్ కుమార్,** ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అంగరంగ వైభవంగా రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో పార్వతీ త్రిపురాంబా సమేత త్రిపురాంతకేశ్వరుడు

త్రిపురాంతకం: పార్వతీ త్రిపురాంబా సమేత త్రిపురాంతకేశ్వర స్వామి రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని రథంపై ఉంచి హరహర మహాదేవ నినాదాలతో ఊరేగారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పల్లకి సేవా ద్వారా ఆలయానికి చేర్చారు. రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ అస్సాన్, ఎస్సై బసవరాజు చర్యలు తీసుకున్నారు. ఆలయాల ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకటసుబ్బారావు, కార్యనిర్వహణాధికారిణి డి.రజని కుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు.



వేలాది మంది భక్తుల మధ్య రథంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు



పట్టాలు అందుకున్న ఆనందంలో కేరింతలు కొడుతున్న పీజీ వైద్య విద్యార్థులు

మంచి డాక్టర్లుగా పేరు తెచ్చుకోవాలి



పట్టాలు అందుకుంటున్న పీజీ వైద్య విద్యార్థులు

ఒంగోలు టౌన్: నిత్య అధ్యయనం ద్వారా ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు తెలుసుకుంటూ మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు వైద్య విద్యార్థులకు పిలుపునిచ్చారు. నగరంలోని మెడికల్ కళాశాలలో పీజీ వైద్య విద్య పూర్తి చేసుకున్న 2019 బ్యాచ్ వైద్యులకు శుక్రవారం గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించి పట్టాలు ప్రదానం చేశారు. నేటితో చదువు పూర్తయిందని అనుకోవద్దని, జీవితాంతం నేర్చుకుంటూనే విద్యార్థులుగా ఉండాలని సూచించారు. వైద్య రంగంలో అనేక నూతన ఆవిష్కరణలు వస్తున్నాయని, ఆర్టిఫియల్ ఇంటలిజెన్స్‌తో వైద్యరంగం రూపురేఖలే మారిపోతున్నాయని చెప్పారు. ఒంగోలు మెడికల్ కళాశాల నుంచి బయటకు వచ్చిన వైద్యులు అన్ని రంగాలలోనూ రాణిస్తున్నారని చెప్పారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్ ప్రసంగిస్తూ దేశంలో 4 లక్షల మంది వైద్యులు ఉన్నారని, రాష్ట్రంలో ఐఎంఏకి 100 బ్రాంచ్‌లు ఉన్నాయని, 25 వేల మంది వైద్యులు ఉన్నారని తెలిపారు. 20 లక్షల మంది నీట్ పరీక్షలు రాస్తే కేవలం 50 వేల నుంచి లక్ష మందే డాక్టర్ సీటు సంపాదించగలుగుతున్నారని తెలిపారు. ఎంతో శ్రమ తర్వాత వైద్యులై వస్తున్న కొత్త వైద్యులకు అభినందనలు తెలిపారు. డాక్టర్ అంటే కేవలం రోగం నయం చేసేవారే కాదని, మంచి సపోర్టర్‌గా మసలే వారని చెప్పారు. వైద్య వృత్తి నిబద్ధత కలిగిన వైద్యులకు పూర్తిగా ఆత్మ సంతృప్తి ఇస్తుందన్నారు. జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు



మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ పాల్గొని పలు సలహాలు, సూచనలు చేశారు. 386 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు హాజరయ్యారు. ఏపీఓఎస్ఎస్ (ఎస్ఎస్‌సీ, ఇంటర్)కు సంబంధించి 88 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు హాజరయ్యారు. డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్, జిల్లాలోని ఎంఈవోలు, ఉపవిద్యాశాఖాధికారులు, అసిస్టెంట్ కమిషనర్, పరీక్షల విభాగం, డీసీఈబీ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు.